క్లుప్తంగా

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



వెంకటాపురం(కె): మండలంలోని వీఆర్‌కేపురంలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ పాయం రమణ శనివారం శంకుస్థాపన చేశారు. రూ. 2.20 లక్షలతో పనులు చేపట్టినట్లు జెడ్పీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం శ్రీదేవి, దామోదర, మురళి, శివాజీ, రమణయ్య, కన్నయ్య, రాంబాయి, నాగేష్ ఉన్నారు.

కలిపాకలో వైద్య శిబిరం



వెంకటాపురం(కె): మండలంలోని కలిపాక గ్రామంలో స్థానిక వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఉండాలని సూచించారు.

వాహనాల తనిఖీ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ, ప్రధాన కూడళ్లలో స్థానిక రెండో ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహన పత్రాలు లేని వాహనచోదకులకు జరిమాన విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీస్‌లు ఉన్నారు.

ఆర్థిక సాయం..



ములుగు రూరల్: విద్యుత్ శాఖలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తూ విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన నల్లాల కృష్ణ కుటుంబానికి మల్లంపల్లి గ్రామస్తులు అండగా నిలిచారు. ఈ మేరకు శనివారం శ్రీనగర్ గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులకు మల్లంపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన రూ. 1లక్ష ఇరవై వేలను బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోల్కొండ రవి, ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, ల్యాద శ్యాంరావు, రవిబాబు, రామిరెడ్డి, వేణు, అనిల్, రాజిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తరలిన ఉద్యోగులు



ములుగు : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లాలోని సుమారు 200 మంది ఉద్యోగులు హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాసభకు తరలివెళ్లారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గళ్లగట్టు, సంజీవ, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి శిర్ప సతీష్ కుమార్, పీఆర్టీయూ, టీఎస్ మండల అధ్యక్షుడు కంచు ప్రభాకర్, టీఈఏ జిల్లా ఉపాధ్యక్షుడు బోడ కుమార్, ఫార్మసీ ఉద్యోగుల సంఘం నాయకులు సుద్దబోయిన వెంకట్, స్వామి, సమ్మయ్య, రమేష్ బాబు, శివ ప్రసాద్, కిశోర్ , రాజేందర్, యాసిన్ , ప్రకాంత్ తరలివెళ్లినవారితో ఉన్నారు.

మల్హార్‌రావు సేవలు చిరస్మరణీయం



మల్హార్: మారుమూల ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం పరితపించిన మల్హార్‌రావు సేవలు చిరస్మరణీయమని బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జిల్లా జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మల్హార్‌రావు జయంతి సందర్భంగా శనివారం కొయ్యూర్ సెంటర్‌లోని మల్హార్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్, మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాశ్‌రావు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొదలైన 'గృహలక్ష్మి' సర్వే



మంగపేట : బాలన్నగూడెంలో గృహలక్ష్మి లబ్ధిదారుల దరఖాస్తును పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు సర్వేలు చేపట్టారు. ములుగు అసెంబ్లీ నియోజకవర్గానికి 2,590 ఇళ్లు మంజూరుకాగా మండలంలోని 25 గ్రామపంచాయతీల పరిధిలో 3431 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ నేరుగా లబ్ధిదారుడి ఇంటికెళ్లి వాస్తవ పరిస్థితిని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులను పరిశీలించేందుకు 8 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 25 గ్రామ పంచాయతీల్లో 641 మంది లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలించి వాస్తవ స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐ కుమారస్వామి, జూనియర్ అసిస్టెంట్ నందకిశోర్, సూపరింటెంట్ ఆలేటి సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికెళ్లి అధికారులు శనివారం సర్వేలు చేపట్టారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి 17 గ్రామ పచాయతీల్లో సర్వే చేపట్టారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా గృహలక్ష్మి పథకానికి మండల వ్యాప్తంగా 3404 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

కన్నాయిగూడెం: ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తుల గడువు ముగియడంతో అధికారులు అర్హుల జాబితాను ఫైనల్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, పంచాయతీశాఖ అధికారులు సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ ఎండీ. సలీం తెలిపారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో 1233 దరఖాస్తులు రావడంతో మండలంలోని బుట్టాయిగూడెం, చింతగూడెం, సర్వాయి, లక్ష్మీపురం, ముప్పనపల్లి గ్రామాల్లో అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. మొదటి రోజు 127 దరఖాస్తులును గుర్తించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పనిచంద్ర, డీటీ సయ్యద్, సర్వర్, ఆర్‌ఐ. గణేష్, ఎంపీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వాజేడు: సర్వే చేస్తున్న అధికారులు



కన్నాయిగూడెం : సర్వే చేపట్టిన అధికారులు

ఏటూరునాగారం: మండలలంలోని కొండాయి పంచాయతీ పరిధిలో గల దొడ్ల, కొత్తూరు గ్రామాల్లో వరదలతో దెబ్బతిన్న ఇళ్లు, గృహలక్ష్మి దరఖాస్తుదారుల ఇళ్లను పరిశీలించినట్లు తహసీల్దార్ వీరస్వామి శనివారం తెలిపారు. మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో గృహలక్ష్మి పథకానికి 2,718 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల వారీగా సర్పంచ్‌ల సమక్షంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కుమార్‌లతో పాటు ఇతర శాఖల అధికారులు సర్వేలు చేపట్టామన్నారు. కార్యదర్శులు సతీష్, రమాదేవి, సందీప్, శ్రీనివాసరావు, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.



ఏటూరునాగారం : సర్వే చేస్తున్న తహసీల్దార్

సేవా కార్యక్రమాలకు సహకరిస్తాం



రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాపురం(కె): స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో తన వంతు సహకారం ఉంటుందని స్థానిక సీఐ బండారి కుమార్ అన్నారు. మండల కేంద్రంలో చేయూత సచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారభించారు. స్థానిక ముస్లిం సోదరులు ఏటూరునాగారం సివిల్ ఆసుపత్రికి 18 యూనిట్ల రక్తాన్ని దానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంచి కార్యక్రమాలను చేపడుతున్నారని అభినందించారు. వారు చేపట్టే మంచి కార్యక్రమాల్లో తమవంతు పాత్ర ఉంటుందన్నారు. రక్తదానం చేసిన దాతలను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ములుగు : జిల్లా కేంద్రానికి చెందిన ఓజ్జెల లింగన్న ఇటీవల మృతి చెందగా ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, అధ్యక్షుడు బానోతు రవిచందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంగ రవి యాదవ్, మండల అధ్యక్షులు చాంద్ పాషా, పాలడుగు వెంకటకృష్ణ, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్లు నల్లెల భరత్ కుమార్,, బండి శ్రీనివాస్, కొంపెల్లి శ్రీనివాస్, ఓం ప్రకాశ్, పీఏసీఎస్ చైర్మన్ సత్తిరెడ్డి, బొంతల వేణు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని నిమ్మనగర్‌కు చెందిన మామిడి నర్సిరెడ్డి, గుర్తూరుతండాకు చెందిన గుగులోతు నర్సింహా, రహీంనగర్‌కు చెందిన బానోతు ఇస్రా నాయక్, ముద్దునూరుతండాకు చెందిన బానోతు వెంకన్న, కొడిశెల కుంట గ్రామానికి చెందిన స్వాతి, శ్రీను ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట పార్టీ ముఖ్య కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీదే గెలుపు..



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వెంకటాపురం(కె): రానున్న ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీతో గెలుపొంది అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ త్రినాథరావు, గిరిజన మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు సతీష్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీజేపీ గ్రామస్థాయి నుంచి బలోపేతం అవుతుందన్నారు. ప్రతీ బూత్ సభ్యుడు ఓటర్లను కలిసి ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో అంకాల దుర్గ, సరిత, హేమ సుందర్, లక్ష్మిశేఖర్, కిషన్, నవీన్, వెంకటేశ్వర్లు, సాయి, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.19 లక్షల 50 వేలతో నూతనంగా నిర్మించిన డాక్టర్స్ క్వార్టర్స్‌ను, కొర్కిశాల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.2 కోట్ల 5 లక్షలతో నిర్మించిన ఇంటర్ తరగతి గదులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరం 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖలో గతంలో కంటే ఎంతో మార్పు వచ్చిందన్నారు. విద్య రంగంపై సీఎం కేసీఆర్ దూరదృష్టితో సకల హంగులతో కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యను అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలసి భోజనం చేశారు. తమ పాఠశాలకు ఉన్నత సదుపాయాలు కల్పించినందుకు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, డీఈఓ రామ్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ శైలజ, మండల వైద్యాధికారి నాగరాణి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, తహసీల్దార్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

వాజేడు: యూఎస్ 341 మిర్చి విత్తనాలు కొంత ఆలస్యంగా మొలకెత్తుతాయని ఏవో నర్సింహారావు శనివారం ప్రకటనలో తెలిపారు. యూఎస్ 341 మిర్చి విత్తనాలు విత్తిన రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఆ విత్తనాలను రాజేంద్రనగర్‌లోని విత్తన కేంద్రంలో పరిశీలించినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలు సైతం వచ్చాయన్నారు. మొలక శాతం 78 ఉండగా విత్తన శుద్ధి 99 శాతం ఉందని పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి అర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నేటి(ఆదివారం) నుంచి ఊరూరా గ్రామ బాట నిర్వహించనున్నట్లు ఆప్ మండల అధ్యక్షుడు మంత్రి రాకేష్, యువజన విభాగం జిల్లా ఇన్‌చార్జ్ కొండ్ర సాయితేజ తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో గ్రామ బాట వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదిన్నార సంవత్సరాలు అవుతున్నా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం గ్రామ బాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నాయకులు కుమార్, రవి, డేవిడ్, అఖిల్, మహేష్, సాజిత్ పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకోని ప్రభుత్వం



వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైౖ ప్రజలు సర్వం కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్నారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సాయం ప్రకటించకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. హైదరాబాద్ కొంపెల్లి మున్సిపాల్ కౌన్సిలర్ శికుమార్‌గౌడ్ సహకారంతో గోవిందరావుపేట మండలం చంద్రుతండాల్లోని బాధిత కుటుంబాలకు దుప్పట్లు, నిత్యవసరాల సరుకులను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ వర్షాలు కురిసి 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోలేదన్నారు. ముంపు సమయంలో పర్యటించిన మంత్రుల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దాతల సహకారంతో ఎమ్మెల్యేగా తనవంతుగా బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

భూపాలపల్లి అర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరం బెనరస్ విశ్వవిద్యాలయంలో దేశ స్వాతంత్ర్యం కోసం ఏర్పడినటువంటి మొట్టమొదటి విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ చదువు కోసం పోరాడు చదువుతూ పోరాడు అనే నినాదంతో విద్యార్థులను చైతన్యవంతం చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న రావుల రమేష్

ములుగు : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్ పీసీ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా నాయకుడు ధన్‌రెడ్డి ఆదిరెడ్డి, స్టీరింగ్ కమిటీ నాయకుడు రావుల రమేష్, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని భావించామని, కానీ ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ పాలనలో పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు అయ్యిందని విమర్శించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల 1 వ తేదిన వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గొప్ప సమ్మారావు, వాసుదేవరెడ్డి, సమ్మయ్య, నరేంద్రకుమార్, వెంకటస్వామి, రవీందర్, సమ్మయ్య, లక్ష్మయ్య ,వెంకటస్వామి, తిరుపతయ్య, లక్ష్మీ నారాయణ, పాపారావు, శంకర్, పురుషోత్తంతో పాటు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప సభను విజయవంతం చేయాలి



ప్రచారం చేస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

ములుగు రూరల్: విశ్వరూప బహిరంగ సభను విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ జిల్లా సమన్వయ కర్త, జిల్లా కో ఆర్డినేటర్ నెమలి నర్సయ్యమాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండలంలోని మదనపల్లిలో ప్రచార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా మాదిగల ఉప కులాల అభ్యున్నతికి ఎమ్మార్పీఎస్ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఐక్య పోరాటాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభకు 30 లక్షల మంది మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ పుల్లూరి కరుణాకర్, ఎంఎస్‌పీ నేత జన్ను మాదిగ, రవీందర్ పాల్గొన్నారు.

భూమి ఆక్రమించుకోవడం అన్యాయం



భూమిని పరిశీలిస్తున్న సతీష్

వాజేడు: ఆదివాసీల భూమిని గిరిజనేతరులు ఆక్రమించుకున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్ ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని అరుణాచలపురం (జి)లోని 69/1 ఖాతా నెంబర్ 99లో గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఇరుప వెంకటనర్సమ్మ పట్టా భూమిని శనివారం పరిశీలించారు. 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న వెంకటనర్సమ్మ పట్టా భూమిని గిరిజనేతరులు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ పార్టీల అండదండలు, ఆర్థి బలంతో పాటు అధికారుల అండదండలు ఉన్నట్లు ఆరోపించారు. అన్యాయంగా తమ వరి పంటను ధ్వంసం చేసిన గిరిజనేతరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆదివాసీల భూమిని ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బుచ్చయ్య, సతీష్, బాలాజీ, సునీల్ ఉన్నారు.

దాతలు ముందుకు రావాలి



సరుకులను పంపిణీ చేస్తున్న శోభారాణి

ఎస్ఎస్‌తాడ్వాయి: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని స్పందన సేవా సొసైటీ రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అనుమాండ్ల శోభారాణి పిలుపునిచ్చారు. మండలంలోని ఊరట్టంలోని ఆ సొసైటీ ఆధ్వర్యంలో 50 మంది వరద బాధిత కుటుంబాలకు శనివారం నిత్యాసవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా శోభరాణి మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి 20 రకాల వస్తువులను అందజేసినట్లు తెలిపారు. సరుకుల పంపిణీకి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ సభ్యురాలు గౌతమి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ జ్యోతి, రాజు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



ఎస్ఎస్‌తాడ్వాయి : నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు



ఏటూరునాగారంలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారం, ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లోని వరద బాధితులకు హైదారాబాద్‌కు చెందిన కొంపెల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ శివకుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ మాట్లాడుతూ మేడారంలోని వరద బాధిత కుటుంబాలకు కాజీపేటలోని ఫాతిమానగర్ సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్, మాంట్‌ఫోర్ట్ పాఠశాలల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వంద మంది వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల, కొండాయి గ్రామాలకు చెందిన 250 మంది వరద బాధితులకు మానవ కల్యాణ్ సేవా సమితి(కాచిగూడ) హైదరాబాద్, ఇండియన్ రెడ్‌క్రాస్‌సొసైటీ ఆధ్వర్యంలో శనివారం చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా బాధితులకు దుప్పట్లు, టార్పాలిన్ కవర్లు పంపిణీ చేశారు. అలాగే స్టీల్ సామాను, ఇతర దుస్తులు అందించారు. ఒక్కొక్కరికి రూ.3వేల విలువ చేసే కిట్లను అందించినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యుడు కొత్తపల్లి ప్రసాదరావు వెల్లడించారు. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న ఏఎన్ఎంల సమ్మె



వంటావార్పు కార్యక్రమం చేపట్టిన రెండో ఏఎన్ఎంలు

ములుగు రూరల్: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు చేపట్టిన నిరసన శనివారం వంటావార్పుతో కొనసాగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న రెండవ ఏఎన్ఎంలను ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకురాలు సరోజన పాల్గొన్నారు.